
# అన్నమయ్య కథ

- కాశీనాధుని రాధ, న్యూజెర్సీ



క్రీస్తు శకం 1408 ప్రాంతంలో అంటే ఈ నాటికి 600 సంవత్సరాల క్రితం తాళ్ళపాక అన్నమయ్య అనే వాగ్గేయకారుడు జన్మించి తెలుగు వాఙ్మయపు కుందనపుబొమ్మకి తన పదకవితా మాలికలని అలవోకగా అలంకరించి, తాను తరించడమే కాక, తెలుగువాళ్ళుగా పుట్టినవాళ్ళనీ, పుట్టబోయేవాళ్ళనీ కూడా తరింపజేసాడు.

32 వేల సంకీర్తనలు, సంకీర్తన లక్షణం అనే సంస్కృత లక్షణ గ్రంథం, సంస్కృతంలో వేంకటాద్రి మాహాత్మ్యము, తెలుగులో ద్విపద రామాయణం, శృంగారమంజరి అనే మరో ద్విపద, వేంకటేశ్వర శతకం మొదలైన పన్నెండు శతకాలు అన్నమయ్య రచనలు. కవిత్వాన్ని చదివినప్పుడు అది మనకి బాగా అర్థం అయిందంటే కవి హృదయం తెలిసినట్టు లెక్క. మరి కవిని అలాంటి భావసంపన్నుడిగా చేసిన పరిస్థితులేమిటో తెలియాలంటే తెలుసు కోవలసినవి అతని పుట్టుపూర్వోత్తరాలు. ఈఅన్నమయ్యగారి జీవిత చరిత్ర గురించి కొంచం తెలుసుకుందాం.

తిరుపతి దేవస్థానంలో ఎవరికీ తెలియకుండా దాగున్న అన్నమయ్య రచనలని తెలుగువారికి అందించిన మహనీయులు శ్రీవేటూరి ప్రభాకర శాస్త్రిగారి పరిశోధన, అన్నమయ్య మనుమడు చినతిరువేంగళనాధుడు లేదా చిన్నన్న రచించిన "అన్నమయ్య చరిత్రము" అనే ద్విపదకావ్యం ఆయన జీవితాన్ని తెలుసుకోవడానికి చక్కని ఆధారాలు. తమ వంశచరిత్ర తెలుగుభాషా చరిత్రలో వన్నెకెక్క గలదని ముందే తెలుసునేమో అన్నట్టు తాళ్ళపాకవారు తాటాకుల బదులు తామ్రపత్రాలని వాడారు. అంతే కాకుండా విశేషమైన సందర్భాలని తారీకులతో సహా రికార్డు చేసారు.

అన్నమయ్య పూర్వీకులు కడపజిల్లాలోని తాళ్ళపాక గ్రామానికి చెందిన నందవరీకబ్రాహ్మణులు. అందుకే వారిపేరు తాళ్ళపాక వారైంది. వేదపండితుడు, దైవభక్తిసంపన్నుడు అయిన నారాయణసూరి, భక్తురాలు, సంగీతజ్ఞానసంపన్నురాలు అయిన లక్కమ్మ దంపతులకి వేంకటేశ్వర వరప్రసాదంతో జన్మించిన పుత్రుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు. తల్లి ఉగ్గుపాలతో సంగీతజ్ఞానాన్ని కూడా రంగరించి పోసింది. అంతే మరి ఈ బాలుడికి మాటకీ పాటకీ తేడాలేకుండా పోయింది. పుట్టింది హరినామ సంకీర్తనకే అన్నట్టు తిరిగే ఈ చిన్నవాడి వ్యవహారం పెద్దలకి నచ్చలేదు. దాంతో అతన్ని దారిలో పెట్టే తాపత్రయంతో వాళ్ళు చెప్పే పనిపాటలు, బాధ్యత పేర వాళ్ళుపెట్టే చికాకులు నచ్చక, ఒక నాడు తనవాళ్ళనీ, తాళ్ళపాకనీ వదలి కట్టు బట్టలతో తిరుపతి దేవుని దర్శించడానికి బయలుదేరాడు. తోవలో అలసిన అన్నమయ్యకి ఒక తల్లి కనబడి అన్నం పెట్టి సేదతీర్చిందట. ఆ వచ్చిన తల్లి తన తల్లి అలమేలుమంగే నని నమ్మి ఆశువుగా వేంకటేశ్వరశతకంలో ఆమెను వర్ణిస్తూ వ్రాసాడు. స్వామి దర్శనానికై వేచివున్న అన్నమయ్య ఆశువుగా వేంకటేశ్వర శతకం చెప్పడం జరిగింది. చుట్టుపక్కలవాళ్ళంతా అతడు వరప్రసాది అయివుండాలనుకున్నారు. తరవాత ఘనవిష్ణువు అనే వైష్ణవయతి, స్వప్నంలో సాక్షాత్కరించిన స్వామి ఆదేశాన్ని అనుసరించి చక్రాంకితలు వేసి అన్నమయ్యని వైష్ణవుడిగా చేసాడు. కొంతకాలం హరిసంకీర్తనం చేస్తూ అక్కడే ఉండిపోయాడు.

కొడుకు జాడ తెలియని తల్లి తల్లడిల్లుతూ తిరుపతికి చేరి ఇంటికి రమ్మని బతిమాలింది. ఈ విషయం గురించి - కలలో శ్రీహరి కనబడి తల్లిమాట విని ఇంటికి వెళ్ళమని చెప్పినట్టుగా "అన్నమయ్య చరిత్రము" లో చెప్పబడింది.

తిరిగి స్వగ్రామాన్ని చేరుకున్నాడు అన్నమయ్య. కొంత కాలానికి తిరుమలమ్మ, అక్కలమ్మలని వివాహం చేసుకున్నాడు. వీరిద్వారా ఇద్దరు కొడుకులు, ఒక కూతురు కలిగారు. కొడుకులు, అల్లుడు, తదనంతరం మనుమలు, మునిమనుమలు కూడా కవులు, సంకీర్తనకర్తలు అయి వంశానికే వన్నె తెచ్చారు.

అటు తరువాత అన్నమయ్య అహోబల పీఠాధిపతులైన ఆదివణ్ శఠగోప మునుల దగ్గరకి వెళ్ళి వేదాంతాన్ని అధ్యయనం చేయడం జరిగింది. అహోబలంలో వుండగా నరసింహస్వామి మీద ఎన్నో సంకీర్తనలని రచించాడు.

బాల్యమిత్రుడు, విజయనగర సామంతుడు, టంగుటూరి పరిపాలకుడు అయిన సాళ్వ నరసింహరాయలు అన్నమాచార్యుల ఆశీర్వచనంతో శత్రువులని జయించి పెనుగొండలో పట్టాభిషిక్తుడై, అన్నమయ్యని రావించి సత్కరించాడు. ఆసందర్భంలో అన్నమయ్య సంకీర్తనలు విని వివశుడైన నరసింహరాయలు, తన గురించిన సంకీర్తనలని వ్రాయమని కవిని కోరాడుట. "నరహరి కీర్తన నానినజిహ్వ ఒరుల నుతింపగ నోపదు జిహ్వ" అని లేచి వెళ్ళిపోయాడుట అన్నమయ్య. నరసింహరాయలవారికి ఆగ్రహం వచ్చింది. రాజుగారు తలుచుకుంటే దెబ్బలకేం కొదవ అన్నట్లు సంకెళ్ళువేయించి, కారాగృహంలోకి త్రోయించాడు. పట్టి చంపేవేళ యందు పట్టంకట్టేవేళయందు సమదృష్టికల అన్నమయ్య "ఆకటి వేళల నలపైన వేళలను తేకువ హరినామమే దిక్కు మరిలేదు" అని భగవన్నామస్మరణ చేస్తూండగా సంకెళ్ళు వాటంతట అవే విడిపోయాయి. అన్నమయ్య మహిమను గుర్తించిన రాయలు అతనిని విడిపించి క్షమాభిక్షకోరి, సన్మానించాడు.

రాజాదరణతో, ప్రజాభిమానంతో సంపన్నుడైన అన్నమయ్య పెనుగొండ, తాళ్ళపాక, తిరుపతి, ఇతర పుణ్యక్షేత్రాలలోను కాలంగడుపుతూ, భగవన్నామ సంకీర్తనంతో ఆత్మని, పదకవితా ప్రాభవంతో సాహిత్యాన్ని సుసంపన్నం చేసాడు.

కర్ణాటకదేశంలో పుట్టి, కన్నడభాషలో పదకవితని వ్రాసి, పాండురంగవిఠలుని సేవించుకున్న పురందరదాసు (1484-1564) అన్నమయ్య సంకీర్తనలలోని మహిమను తెలుసుకుని స్వయంగా వచ్చి ఆయనని దర్శించాడని "అన్నమయ్య చరిత్రం" లో ఉంది.

కాలక్రమాన రాయల కొలువు విడిచి, స్వగ్రామమైన తాళ్ళపాకలోకొంతకాలం ఉండి, చివర తిరుపతిలో జీవితం గడిపి అక్కడే క్రీస్తు శకం 1502లో సంకీర్తనలు చేస్తూ స్వామిలో కలిసాడు తాళ్ళపాక అన్నమాచార్యుడు.

ఆదికవి నన్నయ మొదటిసారిగా తెలుగులో కావ్యరచన చేసినట్టుగానే, అన్నమయ్య అంతవరకు సంస్కృతప్రాకృతాల్లోనే సాగుతున్న పదకవితకి దేశీయతని ఆపాదించాడు. సంస్కృతాన నిర్ణయించబడిన లక్షణాలని తెలుగుకవితాలతకి శృంగారించగలిగిన సాహసి అన్నమయ్య. నన్నయ కంటే మరో పదడుగులు ముందుకు వేసి తన రచనలని అక్షరాల దేశీయం చేసాడు. ఇతరకవుల రచనలలో సామెతలు, నానుడులు, పలుకుబళ్ళు, అచ్చతెలుగు పదాల ప్రయోగాలని గురించి వ్రాసేటప్పుడు మనం ఇంగ్లీషులో చెప్పి నట్లు "కోట్" చెయ్యడం మామూలు అయితే, అన్నమయ్య తన కవితలో వీటిని మీరెలా తప్పించుకోగలరో చూస్తాను అన్నట్టు కుమ్మరించాడు. అందుకే ఆరుద్రగారు తమ సమగ్రాంధ్ర సాహిత్యంలో అన్నమయ్యను గురించి వ్రాస్తూ, "తాళ్ళపాకవారిని చదవందే తెలుగు రాదు" అన్న శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారి మాటలని కోట్ చేస్తూ "ఆమాట అక్షరాల నిజం" అంటూ ఎంఫసైజ్ చేసారు మరి.

భక్తులలో శాంతులు, దాసులు, సఖులు, వాత్సల్యాన్ని చూపేవారు, ప్రేమానురాగాలతో చూసేవారు ఉన్నారు. అన్నమయ్య ప్రత్యేకత ఏమిటంటే అన్నిరకాల భక్తిభావాలని తాను అనుభవించి తాదాత్మ్యంతో సంకీర్తనలు చేసాడు. ముద్దుగారే యశోద ముంగిటి ముత్యమైన ఆశ్రీహరిని ఎత్తుకుని చందమామని చూపిస్తూ గోరుముద్దలు తినిపించాడు, జోకొట్టి జోలపాడాడు, గోపికతానైనాడు, అలమేలుమంగగా స్వామిని సేవించాడు, అంతేకాదు నువ్వు నాస్వామివి కావా నేను వింత వింతలైన విన్నపాలు చేసుకోవాలి పన్నగపుదోమతెర పైకెత్తమని నిలదీసి అడిగాడు. రసరాజమైన శృంగారానికి మొహమాటం లేకుండా తన కవితలో అగ్రాసనం వేసాడు. వేదాంత రహస్యాలని విడమరచి పామరులకు కూడా అర్థం అయ్యేటట్లు చెప్పాడు.

ఆటపాటలతో బాల్యాన్ని గడిపి, యౌవనంలో భగవంతుడిని వెదికి, వేదాంతాన్ని అధ్యయనం చేసి, చక్కని వైవాహిక జీవితాన్ని సాగించి, కవులు పండితులైన పుత్రులని, మనుమలని కని, రాజుల మెప్పుని మన్ననలని పొంది, పండితుల నుండి, ప్రజలనుండి సమానంగా గౌరవాదరాలని పొంది, వార్థక్యంలో స్వామిసన్నిధిని కాలంగడపిన ధన్యజీవి అన్నమయ్య పరిపూర్ణజీవితానికి నిర్వచనం అనడంలో అతిశయోక్తిలేదు.

గమనిక: ఈవ్యాసం శ్రీ ఆరుద్రగారి "సమగ్రాంధ్రసాహిత్యం", శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావుగారి "ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము" ఆధారంగా వ్రాయడం జరిగింది.